క్లుప్తంగా

టీడీపీ నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరిక



తెనాలి: పట్టణ వైకుంఠపురం సమీపంలోని పోతురాజు కాలనీకి చెందిన టీడీపీ పార్టీ మాజీ కౌన్సిలర్ దివంగత యనమద్రి పోతురాజు కుటుంబసభ్యులు తమ మిత్రబృందంతో సహా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. తుమ్మ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పోతురాజు కుటుంబసభ్యులు యనమద్రి తిరుపతిరావు, పద్మ, అయ్యప్ప, ప్రతాప్, తిరుపతిరావు మంగళవారం సాయంత్రం స్థానిక గంగానమ్మపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో పార్టీలో చేరారు. పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ వీరికి పార్టీ కండువాలను కప్పి స్వాగతం పలికారు. పార్టీలో చేరినవారిలో యనమద్రి విజయకుమారి, గంటినపల్లి నాగమణి, కలవపూరి నాగలక్ష్మి, సయ్యే గోహర్‌ఆ, షేక్ జరీనా, షేక్ రమీజా, షేక్ హుస్సేన్‌బీ, బుగ్గెల లక్ష్మీనరసింహ, యనమద్రి ఆషా, వల్లూరి సుశీల, కలవపూరి ప్రశాంత్, కొంద్రు వాసు, జముడుగంటి శివ, కొలూట్లూరు సాయి, నత్తల సంతోష్‌కుమార్ ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు ముస్లింల ప్రచారం



తెనాలి: 'హర్ దిల్ మే వైఎస్సార్' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని పలువురు ముస్లిం నాయకులు తమ సామాజిక వర్గానికి చెందిన ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం పట్టణంలోని 5, 6 వార్డుల్లోని ముస్లిం మైనారిటీల ఇళ్లకు వెళ్లారు. ఈనెల 13 జరగనున్న పోలింగ్‌లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా కిలారి వెంకట రోశయ్యను గెలిపించాలని కోరారు. ఈవీఎంలో అన్నాబత్తుని శివకుమార్ గుర్తు ఒకటో నెంబరులో ఉందని కూడా నమూనా బ్యాలెట్‌ను చూపుతూ అవగాహన కల్పించారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖాలేదా నసీమ్, వైఎస్సార్‌సీపీ పట్టణ ముస్లిం మైనారిటీ విభాగం అధ్యక్షుడు జేబీ జిలాని, మైనారిటీ నాయకులు గోల్డ్ రహిమా, మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుడు పెచ్చింగ్ సుభాని, షేక్ మీరావలి పాల్గొన్నారు.

ధర్మారావు సేవలు మరువరానివి



తెనాలి అర్బన్: మాజీ మంత్రి ఆలపాటి ధర్మారావు రాష్ట్రానికి అందించిన సేవలు మరువరానివని ఆయన అభిమానులు ఎం.దశరథరామిరెడ్డి, జెట్టి అంకినీడు కొనియాడారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీమంత్రి ఆలపాటి ధర్మారావు వర్ధంతిని లక్ష్మీ డీలక్స్ రోడ్డులోని ఆయన విగ్రహానికి మంగళవారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆయన తమ్ముడు ఆలపాటి మాధవరావు, తమ్ముడు కుమారుడు ఆలపాటి ప్రసాద్, మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి



లక్ష్మీపురం: ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకున్నప్పుడే ప్రజాస్వామ్యం బలోపేతమవుతుందని తెలుగు పండిట్ రాజన్న మాస్టారు పేర్కొన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో ఓటరు చైతన్య సభ మంగళవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు పవిత్రమైనదని, పరిపాలన విధానానికి ఆయుధం లాంటిదన్నారు. విశ్రాంత జంతుశాస్త్ర శాఖాధిపతి డాక్టర్ ఆర్.రామచంద్రరావు, సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి మాట్లాడుతూ చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా, రాజకీయ తంతుగా భావిస్తున్నారని అది సరికాదని చెప్పారు. స్వార్థ రాజకీయాల కోసం కోట్ల రూపాయలు వెదజల్లే వారిని ప్రజాప్రతినిధులు కాకుండా అడ్డుకోవటానికి ఓటే శక్తివంతమైన ఆయుధమని చెప్పారు. కార్యక్రమంలో రవి మెడికల్స్ శివశంకర రావు, సంస్థ సీనియర్ సభ్యులు ఎస్. విద్యాధర కుమార్, సి.హెచ్.బాలసుబ్రహ్మణ్యం మాట్లాడారు.

జైనులతో విడదీయలేని అనుబంధం



జైన సంఘీయులతో సమావేశమైన ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: సమాజంలో అన్నివర్గాల ప్రజలకు మేలు చేస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం స్థానిక గంగానమ్మపేటలోని జైనుల దేవాలయాన్ని సందర్శించారు. అక్కడే జైన సంఘీయులతో ఏర్పాటుచేసిన ఆత్మీయ సమావేశంలో మాట్లాడారు. తెనాలికి, జైన సంఘీయులకు విడదీయలేని అనుబంధం ఉందని గుర్తు చేసుకున్నారు. దాదాపు వందేళ్ల క్రితం నుంచి తెనాలిలో జైన సంఘీయుల జీవనం కొనసాగుతోందని చెప్పారు. రాష్ట్రంలోనే ప్రత్యేకంగా ఉండేలా పట్టణంలోని దాదాపు 80 ఏళ్ల క్రితమే అద్భుతమైన జైనుల దేవాలయాన్ని ఇక్కడ నిర్మించుకుని, తమ సంప్రదాయాలను, ఆచారాలను కొనసాగిస్తూ వస్తుండటం ప్రత్యేకతగా చెప్పారు. జైన సంఘీయులతో తమ తండ్రి అన్నాబత్తుని సత్యనారాయణ నుంచి ప్రత్యేక అనుబంధం ఉందన్నారు. తాను నిర్వహిస్తున్న డిగ్రీ కాలేజిలో ఎందరో జైనుల పిల్లలు విద్యాభ్యాసం చేశారని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమాన్ని అందించటమే కాకుండా విద్య, వైద్యరంగాల్లో చేపట్టిన విప్లవాత్మక సంస్కరణలతో ఎన్నో మార్పులు చేశారని జైనులకు వివరించారు. ఫలితంగా అన్ని వర్గాల ప్రజల బిడ్డలకు నాణ్యమైన విద్య, అందరికీ మెరుగైన వైద్యం అందుతున్నాయని గుర్తుచేశారు. ప్రజలకు ఇన్నిరకాలుగా తోడ్పడుతున్న ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించాలని కోరారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్యను, తనకూ విజయం చేకూర్చాలని కోరారు. ఈ సందర్భంగా జైన సంఘీయుల నుంచి ఎమ్మెల్యే శివకుమార్‌కు సాదర స్వాగతం లభించింది. ఆలయ మర్యాదలతో సత్కరించారు. నేమిచంద్ గోవాణి, ఇతర జైన సంఘీయులు, మున్సిపల్ వైస్‌చైర్మన్ మాలేపాటి హరిప్రసాద్ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే పేదలకు మేలు

ఎన్నికల ప్రచారంలో అన్నాబత్తుని సత్యనారాయణ



సత్యనారాయణ చౌదరితో కలసి మేమంతా జగన్ కోసం సిద్ధం అంటున్న గ్రామస్తులు

తెనాలి రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ చౌదరి అన్నారు. రూరల్ మండల గ్రామం సంగంజాగర్లమూడిలో మంగళవారం సాయంత్రం ఆయన పార్టీ ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి వారికి గత ఐదేళ్లలో అందించిన పథకాల గురించి వివరించారు. వర్షం పడుతున్నా వైఎస్సార్‌సీపీ నాయకులను స్వాగతించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ ప్రజలతో మాట్లాడుతూ కరోనా సమయంలో దేశంలో పలు రాష్ట్రాలు ఆర్థిక భారంతో సతమతమైనప్పటికీ ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలు అమలు చేసి ప్రతి పేద కుటుంబం ఆర్థికంగా ఎదిగే విధంగా చర్యలు చేపట్టారన్నారు. గ్రామ స్థాయిలో సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చి, వలంటీర్ వ్యవస్థ ఏర్పాటు చేసి దేశానికే ఆదర్శంగా పాలనను అందించారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రెండు ఓట్లను ఫ్యాను గుర్తుకు వేసి తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ను, ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను గెలిపించాలని అభ్యర్థించారు. ఆయన వెంట కె. భాస్కర్, అరుణ్, రెడ్డి శ్రీను, నాగమోతు నాగేశ్వరరావు, యన్నం సుబ్బయ్య, పాలడుగు సాంబశివరావు, కె. శివరామిరెడ్డి, కె. గోపాలరెడ్డి, ఎస్కే యాసిన్ ప్రచారంలో పాల్గొన్నారు.

1400 మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం



తమ పోలింగ్ కేంద్రం వివరాలను పరిశీలించుకుంటున్న ఉద్యోగులు

తెనాలి రూరల్: తెనాలి కొత్తపేటలోని రావి సాంబయ్య మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్ పోలింగ్ కేంద్రాల్లో మంగళవారం మూడో రోజు ఉద్యోగులు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి రెండు రోజులు సాయంత్రం 4 నుంచి రాత్రి 9 గంటల వరకు నిర్వహిస్తున్న పోస్టల్ బ్యాలెట్‌లో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. మంగళవారం ఉదయం నుండి రాత్రి వరకు పోలింగ్ నిర్వహించారు. సుమారు 1400 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. తొలి రోజు జరిగిన పోస్టల్ బ్యాలెట్‌లో 314 మంది తమ ఓటు హక్కు వినియోగించుకోగా మూడో రోజు పెద్ద సంఖ్యలో ఉద్యోగులు ఓటింగ్‌కు రావడం విశేషం. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సరళిని తెనాలి రిటర్నింగ్ ఆఫీసర్, సబ్ కలెక్టర్ ప్రఖర్ జైన్ పరిశీలించారు. ఉద్యోగులతో మాట్లాడి ఏర్పాట్ల గురించి వివరాలు తెలుసుకున్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. డీఎస్పీ ఎం. రమేష్, వన్ టౌన్ సిఐ దశరథ రామారావు బందోబస్తు పర్యవేక్షించారు.

నైపుణ్యాలతో ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలి



ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో రామకృష్ణ ప్రభు, రాఘవరావు, శ్రీనివాసరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యతో పాటు నైపుణ్యాల ద్వారా ఉద్యోగాలను అందిపుచ్చుకోవాలని గుంటూరు చలమయ్య– కర్నూరపు వెంకటనారాయణ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణ ప్రభు పేర్కొన్నారు. సంగడిగుంటలోని చలమయ్య కళాశాలలో మంగళవారం వివిధ సంస్థల్లో ఉద్యోగాలు సాధించిన 40 మంది విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ విద్యార్థులు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడం గొప్ప విషయమని, జాతీయ స్థాయిలో ఉన్న పెద్ద కంపెనీల్లో ఉద్యోగాలను పొందడం విద్యార్థుల అదృష్టమని అన్నారు. కళాశాల అధ్యక్షుడు పచ్చిపులుసు రాఘవరావు మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు తమకు అప్పగించిన విధులను సక్రమంగా నిర్వహించి, చదువుకున్న కళాశాలకు మంచి పేరు తేవాలని అన్నారు. సంయుక్త కార్యదర్శి మాజేటి ప్రసాద్ మాట్లాడుతూ చదువుకున్న ప్రతి ఒక్కరూ ప్రభుత్వం పై ఆధారపడక ప్రైవేటు రంగంలో సైతం సమర్థత కలిగిన సంస్థల్లో చేరి జీవితంలో స్థిరపడాలని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు, కోశాధికారి జయప్రకాష్, కర్నూరపు సూర్యనారాయణ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ఏ శ్రీధర్, ప్లేస్మెంట్ అధికారి చంద్రశేఖర్, అధ్యాపకులు లక్ష్మీ శుభద్ర, అరుణ కుమారి, భవానీ దుర్గ, ఇందిరా, మల్లేశ్వరి, రాజరాజేశ్వరి పాల్గొన్నారు .

పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్‌తో విద్యార్థులకు ప్రయోజనం

గుంటూరు ఎడ్యుకేషన్: పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్స్ చేయడం ద్వారా విద్యార్థులకు వ్యాపార నైపుణ్యాలతో పాటు వ్యవస్థాపకులుగా ఎదిగే క్రమంలో ప్రయోజనాలు ఉంటాయని హెచ్‌ఆర్ ఫుట్ ప్రింట్స్ సీఈఓ డాక్టర్ రాజ్‌కుమార్ పేర్కొన్నారు. అమరావతిరోడ్డులోని హిందూ మేనేజ్‌మెంట్ కళాశాలలో మంగళవారం ఎంబీఏ, ఎంబీఏ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ విద్యార్థులకు పరిశ్రమల్లో ఇంటర్న్‌షిప్స్ ద్వారా సంస్థలను అనుసంధానించడం అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న రాజ్‌కుమార్ మాట్లాడుతూ తాము అకడమిక్‌గా అధ్యయనం చేసిన అంశాలను వాస్తవ పరిస్థితులతో అన్వయించేలా క్షేత్రస్థాయిలో శిక్షణ పొందడమే ఇంటర్న్‌షిప్ అని అన్నారు. తద్వారా విద్యార్థులకు పరిశ్రమల్లోని క్షేత్ర పరిస్థితులపై అవగాహన పొందడమే కాకుండా నైపుణ్యాలు చేకూరుతాయన్నారు. వీటితో పాటు అంతర్గత నైపుణ్యాలు, టీం వర్క్, పనిలో నైపుణ్యం, నిర్ణయాధికారం, సమస్యను పరిష్కరించే నైపుణ్యాలు దక్కుతాయన్నారు. ఇంటర్న్ ట్రైనీగా చూపే ప్రతిభ, పనితీరు సంస్థ యాజమాన్యం మెచ్చే విధంగా ఉంటే పూర్తిస్థాయిలో ఉద్యోగం లభిస్తుందన్నారు. అనంతరం ఇంటర్న్‌షిప్, ప్రాంతీయభాష, బృందంతో కలసి పని చేసే సమయంలో పైస్థాయి అధికారులతో నడుచుకునే విధానాలను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమణ మాట్లాడుతూ పరిశ్రమలు తమ కళాశాల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ఎంబీఏ విభాగాధిపతి వి. చక్రవర్తి, అసోసియేట్ ప్రొఫెసర్లు డి. కళ్యాణి, ఎస్. గోపి శ్రీనివాసరావు, సీహెచ్ వైష్ణవి, ఏ. బాజీబాబు, వి. అభిలాష్, ఎస్. మణికంఠ, బి.అనిత పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి

మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి



తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేస్తున్న సిటింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్, గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పొన్నూరు సిటింగ్ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్యను ప్రజలు భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ ఎమ్మెల్యే మర్రెడ్డి శివరామకృష్ణారెడ్డి విజ్ఞప్తిచేశారు. కొల్లిపర మండలంలోని తూములూరు గ్రామంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెనాలి నుంచి మరోసారి పోటీలో ఉన్న అన్నాబత్తుని శివకుమార్ రాజకీయంగా నిత్యకృషీవలుడని చెప్పారు. 2019 ఎన్నికల్లో పొన్నూరులో టీడీపీ కంచుకోటను బద్దలు కొట్టి ఎమ్మెల్యేగా ఎన్నికైన కిలారి వెంకట రోశయ్య నియోజక వర్గాన్ని అభివృద్ధి చేశారని శివరామకృష్ణారెడ్డి చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి కిలారి వెంకట రోశయ్య, అన్నాబత్తుని శివకుమార్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

తెలుగు జాతి స్ఫూర్తి ప్రదాత అల్లూరి

లక్ష్మీపురం: అల్లూరి సీతారామరాజు తెలుగు జాతి స్ఫూర్తి ప్రదాత అని ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు అన్నారు. స్థానిక నాజ్ సెంటర్‌లోని అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు శత వర్ధంతి మంగళవారం నిర్వహించారు. త నాజ్ సెంటర్‌లోని అల్లూరి సీతారామరావు విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు అమరుడై వందేళ్లు అయిందని ఆయన నేతృత్వంలో ఆదివాసీల మౌలిక సమస్యల పరిష్కారం కోసం బ్రిటీష్ పాలన అంతం కోసం 1922 ఆగస్టు నుంచి 1924 జూన్ వరకు విశాఖ, గోదావరి మన్య ప్రాంతంలో మహోధృత పోరాటం జరిగిందన్నారు. మేధావుల ఫోరం కన్వీనర్ పి.ఎస్. మూర్తి, అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి మాట్లాడి నివాళులర్పించారు.

నైపుణ్యాలతో ప్రతిభ నిరూపణ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు తమలోని నైపుణ్యాలను వెలికితీసినప్పుడే ప్రతిభను నిరూపించుకుని ఉద్యోగాలను సాధించగలరని వేద విజ్ఞాన అకడమిక్ రీసెర్చ్ సెంటర్ మేనేజింగ్ డైరెక్టర్ వి. జ్ఞానసాగర్ పేర్కొన్నారు. మంగళవారం అమరావతిరోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో బీ ఫార్మసీ చివరి సంవత్సర విద్యార్థులకు ఉద్యోగ నైపుణ్యాలు, ఇంటర్వ్యూ స్కిల్స్‌పై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, కరస్పాండెంట్ డాక్టర్ ఎస్. మధుసూదనరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ కె.రవికుమార్, ఓఎస్డీ పి. సీతారామయ్య, హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ కె.విజయ భాస్కర్, సీహెచ్ ప్రసాదరావు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికల్లో నిజాయతీ పరులను ఎన్నుకోవాలి



గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకుని నిజాయతీ పరులను ఎన్నుకోవాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పిలుపునిచ్చారు. మంగళవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ కార్యాలయంలో ఎన్నికల మేనిఫెస్టోలో ఉండాల్సిన అంశాలపై కరపత్రాలను విడుదల చేశారు. ఈసందర్భంగా లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన విద్య, వైద్యం అందించేవారిని, పర్యావరణాన్ని కాపాడే వారిని గెలిపించాలని కోరారు. ప్రజలకు ఉపాధి కల్పన, వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, మద్యం, మాదక ద్రవ్యాలను నిషేధించేవారినే గెలిపించాలన్నారు. మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా ప్రజల్లో శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేవారిని ఎన్నుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జేవీవీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి. జాన్‌బాబు, బి. ప్రసాద్, జి. వెంకటరావు, బి. శంకర్‌సింగ్, ఎం. ఉదయ్‌భాస్కర్, బి. ప్రతాప్‌సింగ్, టీఆర్ రమేష్, బి. ఉదయ్‌భాస్కర్, షేక్ సుభానీ పాల్గొన్నారు.

ఏఎన్‌యూ నేపాల్ వర్సిటీతో ఎంఓయూ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ బౌద్ధ అధ్యయన విభాగం నేపాల్‌లోని లుంబినీ బుద్ధిస్ట్ యూనివర్శిటీతో ఎంఓయూ(అవగాహన ఒప్పందం) కుదుర్చుకుంది. ఈనెల 4,5 తేదీలలో నేపాల్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ఏఎన్‌యూ బుద్ధిజం విభాగాధిపతి ఆచార్య ఎల్. ఉదయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా లుంబినీ యూనివర్సిటీతో ఏఎన్‌యూకి ఎంఓయూ కుదుర్చుకున్నారు. ఎంఓయూ పత్రాలను మంగళవారం ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్‌కు ఉదయకుమార్ అందజేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రొఫెసర్ రాజశేఖర్ మాట్లాడుతూ రెండూ యూనివర్సిటీల మధ్య కుదిరిన ఈ ఒప్పందంతో రెండు దేశాల మధ్య సాహిత్య, సంస్కృతిక, మేధపరమైన అంశాలపై విస్తృత పరిశోధనలు జరగాలన్నారు. బుద్ధిజంపై విస్తృతంగా అధ్యయనం, పరిశోధనలు చేసే అవకాశం ఉంటుందని ఆచార్య ఉదయకుమార్ తెలిపారు. రెండు యూనివర్సిటీలు పరస్పర అవగాహనతో విద్యా, పరిశోధనలు చేస్తాయన్నారు. కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.మధుబాబు, ఐక్యూఏసీ డైరెక్టర్ ఆచార్య సంధ్యాకోల్, సీడీఈ డైరెక్టర్ డాక్టర్ బి.నాగరాజు, ఐఎస్సీ డైరెక్టర్ ఆచార్య జి.చెన్నారెడ్డి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలు సిద్ధం

ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్ తనయుడు సత్యనారాయణ



రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న శివకుమార్ తనయుడు సత్యనారాయణ



అట్లు పోస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్న శివకుమార్ తనయుడు సత్యనారాయణ

తెనాలి అర్బన్: వైఎస్సార్‌సీపీని గెలిపించేందుకు ప్రజలందరూ సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్‌సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని సత్యనారాయణ పేర్కొన్నారు. 16వ వార్డులోని కవేశా వంతెన వద్ద నుంచి మంగళవారం ఉదయం ఎన్నికల ప్రచారంలో భాగంగా రోడ్ షో నిర్వహించారు. ఆయనకు 18వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌ఛార్జి కాళిదాసు వెంకటసత్యం, వార్డు నాయకులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. వార్డులోని అన్ని వీధుల్లో పర్యటిస్తూ ప్రజలకు అభివాదం చేస్తూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. వార్డులోని ప్రజలు రోడ్లపైకి వచ్చి ఆయన పై పూలు చల్లుతూ తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, కౌన్సిలర్ పేరం సంజీవరెడ్డి, పార్టీ నాయకులు కురగంటి రవిశంకర్, షేక్ గఫూర్, కాళిదాసు వెంకటేశ్వరరావు, కోలా వాసు, గ్యాస్ సుభానీ, రాజ్‌కుమార్, సిరికృష్ణ, కావేటి ఈశ్వర్, బ్రదర్ ఆనందన్న, కొమ్ము రాయల్, అక్కిదాసు కిరణ్‌కుమార్, సీఖేరారెడ్డి, జూపల్లి వంశీ తదితరులు పాల్గొన్నారు.

1వ నెంబర్ బటన్ నొక్కి రెండు ఓట్లు వేయండి



ఎన్నికల ప్రచారాన్ని నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ కోటేశ్వరరావు, పార్టీ నాయకులు



38వ వార్డులో ఓట్లు అభ్యర్థిస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ విజయలక్ష్మి



13వ వార్డులో ఈవీఎం మిషన్‌పై ఓటు వేసే విధానాన్ని తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్

తెనాలి అర్బన్: మే 13న జరిగే ఎన్నికల్లో ఈవీఎంలపై 1వ నెంబర్ బటన్‌పై రెండు ఓట్లు వేయాలని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు గుంటూరు కోటేశ్వరరావు, కుర్రా సుజాత, వీర్లపాటి విజయలక్ష్మి కోరారు. పట్టణంలోని 13, 15, 38 వార్డుల్లో ఆయా వార్డు కౌన్సిలర్లు మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ పార్లమెంట్, అసెంబ్లీ అభ్యర్థుల కరపత్రాలను పంపిణీ చేసి ఈవీఎం మిషన్‌లపై ఓటు వేసే విధానాన్ని ప్రజలకు తెలిపారు. రాష్ట్రంలో సంక్షేమ పాలన కొనసాగాలంటే అందరూ ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేయాలని కోరారు. కార్యక్రమంలో 13వ వార్డు నాయకులు కుర్రా శ్రీను, పిల్లి వీరయ్య, పిల్లి ప్రేమరాజ్, చంద్రశేఖర్, సుహాసినీ, రాఘవులు, అన్వేష్, 15వ వార్డు నాయకులు గుంటూరు గోపి, సుంకర కొండలరావు, మట్టెంపూడి నాగరాజు, సురుపుల వెంకట్రావు, బి.శివకృష్ణ, షేక్ కౌసర్, శంకర్, 38వ వార్డు నాయకులు పెసర్లంక రమణ, పలువురు వార్డు కన్వీనర్లు పాల్గొన్నారు.

తెనాలిలో ఈదురు గాలుల బీభత్సం



తెనాలి పట్టణంలో ఈదురు గాలుల బీభత్సం

తెనాలి: వేసవి ఉక్కపోత అనుభవిస్తున్న పట్టణ ప్రజలకు మంగళవారం సాయంత్రం వింతైన అనుభవం ఎదురైంది. ఒక్కసారిగా సూర్యుడు అదృశ్యమై, ఆకాశం నిండా కారుమేఘాలు అలుముకున్నాయి. ఒక పక్క కదులుతున్న మేఘాలతో పాటే సాయంత్రం నాలుగు గంటల ప్రాంతంలో హఠాత్తుగా ఈదురు గాలులు మొదలై బీభత్సం సృష్టించాయి. దుమ్మూ ధూళి, క్యారీబాగ్‌లతో సహా గాలిలో 40 అడుగుల ఎత్తువరకు ఎగురుతూ కనిపించాయి. రోడ్లపై ప్రయాణిస్తున్నవారికి అయోమయాన్ని కలిగిస్తే, ఇళ్లలోనివారు ఇంట్లోకి వస్తున్న దుమ్మూ ధూళికి కిటికీలు, తలుపులు బిగించుకున్నారు. గత కొద్దిరోజులుగా వేసవి తీవ్రతను అనుభవిస్తున్న ప్రజలను, గాలుల తీవ్రత భయాందోళన కలిగించింది. దీనికితోడు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. బీభత్సం కొంత మందగించాక బయటకు వచ్చినవారికి, చల్లనిగాలులు హాయిని చేకూర్చాయి. నిముషాల వ్యవధిలోనే ఒళ్లు చల్లబడింది. సాయంత్రం 6.30 గంటల ప్రాంతంలో అక్కడక్కడా కురిసిన చిరుజల్లులతో మరికాస్త ఉపశమనం కలిగించింది.

వ్యాధి నిర్ధారణ ఫలితాలు సత్వరమే అందించాలి

డాక్టర్ కిరణ్‌కుమార్



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రభుత్వ సమగ్ర ఆస్పత్రిపై నమ్మకంతో వస్తున్నా రోగులకు వ్యాధి నిర్ధారణ పరీక్షల ఫలితాలను సత్వరమే అందించాలని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ చెప్పారు. మైక్రో బయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ వైద్య విభాగాధిపతులతో లేబొరేటరి పరీక్షలు వాటి ఆవశ్యకతపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆస్పత్రికి రోజుకు నాలుగు వేల నుంచి ఐదు వేల మంది వరకు రోగులు వస్తున్నారని వివరించారు. అందులో రెండు వేల మంది రోగులు ఇన్ పేషంట్‌గా ఉంటున్నారని పేర్కొన్నారు. ఆస్పత్రిలో గుండె ఆపరేషన్లు, కిడ్నీ, కాలేయం వంటి ఆపరేషన్లు జరుగుతున్నాయని ఈ పరిస్థితులలో ల్యాబ్ పరీక్షలు ఎంతో ప్రాధాన్యం ఉందన్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్ష ఫలితాలు నిక్కచిగా అందించాలన్నారు. ఆస్పత్రిలో రోగులు 30 నుంచి 40 మందికి పైగా వెంటిలేటర్ పై ఉంటున్నారని తెలిపారు. ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి నుంచి రక్త నమూనాలు బయటకు వెళుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని దానికి తోడు ఆస్పత్రిపై దుష్ప్రచారం చేస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందని చెప్పారు. ఆసుపత్రికి, మెడికల్ కళాశాలకు చెడ్డ పేరు తీసుకుని రావద్దని కోరారు. అందుబాటులో ఉన్న రక్త వ్యాధి నిర్ధారణ పరీక్షలు సత్వరమే చేసి రోగి కోలుకునే విధంగా సహకరించాలన్నారు.

ఎస్‌కేబీఎం పాఠశాల తనిఖీ

నగరంపాలెం: గుంటూరు పశ్చిమ సబ్ డివిజన్ నగరంపాలెం పీఎస్ పరిధిలోని ఏటీ అగ్రహారం 10 వీధిలో ఉన్న ఎస్‌కేబీఎం ఉన్నత పాఠశాలలోని పోలింగ్ బూత్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ తుషార్ డూడీ సందర్శించారు. సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఈనెల 13న బూత్‌లో ఓట్లు వేసేందుకు ఏయే ప్రాంతాల నుంచి ఎంత మంది వస్తారని ఆరా తీశారు. బారికేడ్ల ఏర్పాటు, ఓటర్ల రాకపోకలు, వాహనాల నిలుపుదల, ట్రాఫిక్ ఇతరత్రా అంశాలపై కూలకుషంగా పరిశీలించారు. వేసవి దృష్ట్యా పోలింగ్ కేంద్రాల వద్ద చేపట్టాల్సిన జాగ్రత్తలు, మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వ శాఖల అధికారుల భాగస్వామ్యంతో చర్యలు తీసుకోవాలని సూచించారు.